109038601

# ప్రబోధిని

అధిక భాషించు శూరత్వమధికమయ్యె
కార్యశూరత శూన్యమై కరగిపోయె
బ్రతుకు లాడంబరాలతో భారమాయె
నేటి విద్యార్థి బ్రతుకు యీపాటిదాయె
నేటి విద్యాసంస్థలు యీరీతి అయ్యె.

ప్రేమస్వరూపులారా!

మానవ జీవితము సూర్యోదయముతో ప్రారంభమై సూర్యాస్తమయము తరువాత నిద్రించుటతో ముగిసిపోవుచున్నది. ప్రకృతిలో ప్రతి మానవుని నిత్య జీవితము యీ పరిభ్రమణముపైనే ఆధారపడి వుంటున్నది. ఈనాటి మానవుని నిత్యజీవిత అనుభవము ఒకటి మానవుని సత్యజీవితమనేది మరొకటి. నిత్యానుభవము ఒకటి. సత్యానుభవము ఒకటి. దీనికి ఉదాహరణము. సూర్యుడు ఎప్పుడూ తూర్పు దిశయందే ఉదయిస్తాడు. పడమటి దిశయందే అస్తమిస్తాడు. ఈ రెండిటిని ఆధారముగా గొని ఉత్తర దక్షిణములను మనము నిర్ణయించుకున్నాము. సూర్యుడు దిక్చక్రమునకు పైన కనిపించినప్పుడు పగలనియు యీ దిక్చక్రమునకు క్రిందికి పోయినప్పుడు రాత్రనియు మనము భావిస్తున్నాము. సూర్యునియొక్క ప్రయాణము చేతను, సూర్యునియొక్క బాట చేతను యావత్ దేశము దానికి సమీపమనేది గుర్తించి దాని ఉష్ణోగ్రత స్థితులు మారుతూ వస్తున్నాయి. ఇది మన నిత్యానుభవము.

మరొక కోణములో దీనిని విచారించినప్పుడు భూమి ఒక గోళము. ఇది గోళముగా వుండినప్పుడు తూర్పు పడమరలు, ఉత్తర దక్షిణములు యేమాత్రము లేవు. దీనికి సూర్యోదయ సూర్యాస్తమయములు లేవు. ఇది మరొక కోణములో చూచినప్పుడు సత్యముగా గుర్తించుకోటానికి వీలవుతుంది. మనము ఒక బండియందో లేక రైలునందో కూర్చుని ప్రయాణము సలుపుచున్నప్పుడు బండో రైలో కదిలినప్పుడు మనము కూడ కదలటము సహజము. ఒక బల్లపైన కూర్చున్నప్పుడు బల్ల కదిలెనా మనముకూడ కదలతాము. ఇది మన నిత్యానుభవము. కాని భూమి గంటకు వేయిమైళ్ల వేగముతో తన చుట్టూ తాను తిరుగుతున్నది. ఇంతేకాక సౌరకుటుంబములో యీ భూమి గంటకు 66 వేల మైళ్ల వేగముతో తిరుగుతున్నది. ఇంత వేగముతో భూమి తిరుగుచున్నప్పటికిని మనకు స్థిరముగా వున్నట్లుగా కనిపిస్తున్నది. ఇది సత్యానుభూతి. అయితే యిది సత్యానుభూతియని మానవులు దీనినే అనుసరిస్తున్నారా? లేదు. నిత్యానుభూతినే మనము

109038602

అనుసరిస్తున్నాము. గొప్ప విజ్ఞాన శాస్త్రవేత్త కూడను యిది గోళము యిది తిరగటము చేతనే పగలు రాత్రి యేర్పడు చున్నవని అంతేకాని దీనికి యేమాత్రము మార్పులేదని తెలుసుకున్న వాడు కూడను east, west, morning, evening అని దీనినే వుపయోగపెట్టు కుంటు న్నాడు; దీనినే అనుసరిస్తున్నాడుగాని సత్యాన్ని తాను యే మాత్రము అనుభవించుటములేదు. అనుసరించుటములేదు.

సృష్టి అంతయు పరమాణువుల సముదాయమే. ఈ పరమాణువుల న్నియు శక్తి తరంగములయొక్క విశేషములే. ఈ శక్తి తరంగములన్నీ పరమాణువుల యొక్క ప్రమాణములే. ఈ పరమాణువులన్నీ కూడను ఒకే శక్తి తరంగముల విశేషమునుండి యేర్పడుచున్నవి. ఈ విధమైన పరమాణు శక్తి తత్వము గుర్తించుకున్న వ్యక్తి కూడను యీపరతత్వాన్ని యేమాత్రము విచారించటానికి ప్రయత్నించటంలేదు. దీనికి మరొక ఉదాహరణము. ఒక సముద్రము. ఇది ద్రవ పదార్థము. ఈ సముద్రమునుండి ఒక టంబ్లరు నీరు తీసుకున్నాము మనము. ఆ సముద్రము యొక్క జలము యీటంబ్లరులోనున్న జలము ఒక్కటే. ఈ టంబ్లరు లో మనము ఒక చిన్నరాయి వేసినప్పటికిని యీనీరు కదిలి యీరాయిని మెత్తగా అడుగుకు పంపించటానికి తగిన దారినందిస్తున్నాది. కేవలము రాయిని అడుగుభాగమునకు పోవుటకు దారినందించుటమే కాకుండా యేచిన్నగాలి వీచినా కూడను అది అలలుగా బయలుదేరు తున్నాది. ఇది కూడను పరమాణు శక్తియే. అదే సముద్రమునందు ఉప్పెనగా అనగా గాలి వీచినప్పుడు, అధికమైన గాలి వీచినప్పుడు ఆ సముద్రము యొక్క తరంగములు ఉప్పెనగా బయలుదేరి అది ఒక కఠినమైన రాయికంటె భారమైనదిగా రూపొంది అందులో ప్రయాణం చేస్తున్న పడవలను కూడను ముక్కలు ముక్కలుగా చేయగలదు. ఈ ద్రవమైన యీజలమునకు యీకఠినమైన రాయితత్వము దానికి రావటానికి యిందులోవున్న పరమాణువులే దీనికి కారణము. ఇవన్నియు కూడను శక్తి తరంగములయొక్క విశేషమే.

ఒక రాగి మెటల్ వుంది. ఒక బంగారము వుంది. ఇంతేకాక ఆక్సిజన్ వాయువు కూడా వుంది. ఇవి మూడు కూడను పరమాణువుల యొక్క సముదాయమే. అయితే ఒకదానికి వుండిన విలువ మరొకదానికి లేదు. దీనికి కారణమేమిటి? ఈ పరమాణువుల యొక్క శక్తి ప్రమాణములు అల్పము, అధికముగా వుండటం చేతనే దీనికి విలువలు కూడను అధికముగా అల్పముగా రూపొందుతున్నాయి. ఈ పరమాణువులకంటె మరింత సూక్ష్మమైన అణువులు వుంటున్నాయి. ఇవి ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్ అనే సమ్మిళితమైన స్వరూపములో రూపొందుతుంది. దీని యొక్క సముదాయ స్వరూపమే యీ తరంగములయొక్క విశేషము.

109038603

జగత్తునందు సమస్త పదార్థములు కూడను యీ పరమాణుశక్తి అవసరమై వుంటున్నది. ఈ శక్తి ఒక్కటేగాని రెండు కాదు. దీనినే వేదమునందు 'ఏకోహం బహుశ్యాం అన్నారు. ఏకం సత్ విప్రా బహుధా వదంతి' అనగా వున్నది ఒకటే అయినప్పటికి వ్యక్తులు అనేక రూపములలో, అనేక నామములతో దీనిని అనుభవిస్తూ వచ్చారు. జగత్తునకే పరమాణువుల యొక్క సముదాయము ప్రధానమైనప్పుడు యీ జగత్తునందున్న ప్రతి వస్తువునకు కూడను యీ పరమాణువుల యొక్క ప్రమాణము ప్రధానము. దీనికి మరొక చిన్న ఉదాహరణము. ఇది ఒక గోడ. ఈ గోడ మనం చూడటానికి స్థూలముగాను, అటువైపున వున్న పదార్థమునకు అడ్డుగాను మనకు కనుపిస్తుంది. అయితే యీ గోడ స్థూలమైనదని, కఠినమైనదని మనము భావిస్తున్నాము. ఇందులో యే విధమైన ద్రవపదార్థము లేదని మనము విశ్వసిస్తున్నాము. ఈ గోడ కూడను పరమాణువుల యొక్క సముదాయమే. ఇది పరమాణువుల కంటె సూక్ష్మమైన అణువులతో కూడినది. ఇది బాహ్యదృష్టికి, బాహ్యానుభవమునకు గోడ. ఇది నిత్యానుభవము. కాని దీని యొక్క సత్యానుభవము కూడను గ్రహించటానికి ప్రయత్నించాలి. దీనినే ఒక యంత్రముతో మనము దర్శించటానికి ప్రయత్నించినప్పుడు యీ గోడ అంతా కూడను కేవలము ఒక పెద్ద నక్షత్ర మండలం మాదిరి కనుపిస్తుంది. అనే చిన్న చిన్న అణువులతో కూడినదే యీ గోడ. ఇందులో అనేక విధములైన సందులెంతో వుంటున్నవి. ఒక అణువునకు మరొక అణువునకు మధ్యలో వున్న ప్రమాణం కూడను పరమాణువుగా రూపొందుతుంది.

అదే విధముగా మనము యీ జగత్తును పరిశీలన జరిపినప్పుడు మన నిత్యానుభవము ఒకటి, సత్యానుభవము మరొకటిగా వుంటున్నది. అయితే యీ నిత్యానుభవమునకు సత్యానుభవము ఆధారమై వున్నది. ఆధారమైన సత్యానుభవము యొక్క ఆధేయము చేతనే ఆధేయమైన రూపాన్ని మనము నిత్యానుభవముగా దర్శించగలుగుతున్నాము. ఇది అన్నింటికి ఆధారమైన పరమాణుశక్తి. దీనినే అణోరణీయాన్ మహతో మహీయాన్ అన్నారు. ఈ అణువుగా వుండి మహత్తరమైన శక్తిగా రూపొందుతూ వస్తుంది. ఇంక మిగిలిన యీ నిత్యానుభవములన్ని కూడను సత్యానుభవమునకు రూపాంతరములే. తప్ప అన్యములు కానేరవు. ఈ పరమాణువుల యొక్క శక్తి తరిగిపోవుటనుగాని, పెరిగిపోవుటనుగాని కొంత ఆధారమైన మూలాధారశక్తి ఒకటి వుంది. అదే సత్యానుభవము. సత్యానుభవశక్తి ఒక్కటేగాని రెండు కాదు.

దీనికొక చక్కని ఉదాహరణము. 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, 10 యీ అంకెలను మనము పెట్టాము. ఇందులో ఒకటి తప్ప మిగిలిన అంకెలన్నీ కూడను కేవలము

స్వతంత్రములేనివి. ఒకటి యొక్క రూపాంతరమంతే యీ అన్ని సంఖ్యలు. కాని ఒకటి మినహా మరియొక రూపము లేమాత్రము లేవు అందులో. మూడు అని ఒక సంఖ్య వుండి. మూడు ఒకట్లు చేరి మూడు అయింది. ఒకటి లేకుండా మూడు రాలేదు. దీనికి యింకా ఒకటి చేరిందంటే నాలుగు అని పెరుగుతుంది. ఈ మూడులోపల ఒకటి తీసివేసిన రెండు అని తరుగుతుంది. పెరుగుటకు, తరుగుటకు కూడను ఒకటే ఆధారము కాని మరొక అంకె యిందుకే మాత్రము ఆధారం కాదు. కనుకనే యిట్టి అన్నింటికిని మూలాధారమైన శక్తి ఒకటి వున్నదని యిందులో అనేక విధములుగా మనకు బోధపడుతుంది. ఈ సత్యము మనకు తెలియనంతవరకు కూడను మనము గొప్పవారమని భావిస్తూ వుంటాము. ఒకడు అహంకారము చేత 'మమేవ పండితః' అన్నాడు. నేనే పండితుడను అన్నాడు. కొంతకాలం పరిశోధన చేశాడు. తనను మించిన మరొక శక్తి యీ జగత్తునందున్నదని గుర్తించాడు. అక్కడనుంచి 'మమాంచ పండితః' అన్నాడు. అనగా నేను కూడా పండితుడనే అనే దానిలోకి దిగాడు. మొదట నేనే పండితుడు అనే స్థానము నుండి నేనుకూడా పండితుడను అనే స్థాయికి దిగాడు. ఇంకా పరిశోధనలు సల్పుతూ వచ్చాడు. తన కంటే యెంతో మించిన శక్తి యీ జగత్తునందున్నది, విషయములన్నీ వున్నవి. దీనికి పండితః సమదర్శనః అనే తత్వాన్ని గుర్తించుకోలేక నేనే విధముగా వర్తించుచున్నాననే సత్యాన్ని తెలుసుకున్నాడు. తదుపరి 'మమన పండితః' అన్నాడు. నేను పండితుడను కాదన్నాడు. ఈ మానవత్వము లోపల నిత్యానుభవములో వుండే సత్యాన్ని మనము గుర్తించాలనుకుంటే మనయొక్క స్థితికూడను యిదే మార్గములో ప్రయాణము సల్పుతోంది. మానవుడు నాకన్నియు తెలుసు అనే భ్రమలో తిరుగుతూ వుంటాడు. ఇలాంటి వ్యక్తికి యేమీ తెలియదనే మనము భావించాలి.

బుద్ధుని నిర్యాణమునకు పూర్వము తమ శిష్యులందరు చేరి స్వామీ! ఈ జగత్తు తెలుసుకోటానికి మేమెంతవరకు, యే స్థితిలోకి వచ్చామని ప్రశ్నించారు. ఈ బుద్ధుడు ఒక చెట్టుక్రింద కూర్చున్నాడు. ఒక కొమ్మలో వుండిన కొన్ని ఆకులను తీసి తన గుప్పెటలో పెట్టుకున్నాడు. నాయనా యీ అడవిలో ఎన్ని వృక్షములు ఉన్నవి? అని ప్రశ్నించాడు బుద్ధుడు. ఈ వృక్షములలో ఎన్ని ఆకులుంటున్నవి, ఈ అడవిలో అన్నాడు. ఇలాంటి అడవులు యీ జగత్తులో యింకా ఎన్ని వున్నాయి అన్నాడు. ఈ జగత్తులోవున్న అడవులయందున్న ఆకులన్నిటిలోన నేను గుప్పెటగా తీసుకున్నానే యీ ఆకులంత మాత్రమే మీరు కనుకున్నారు. ఈ ప్రపంచములో వుండిన అడవులలో పెరిగిన వృక్షములందున్న ఆకులన్నిటిలోన యీ గుప్పెడు ఆకులు ఎంత ప్రమాణమో అంతనే మీరు కనుగొన్నారు అన్నాడు.

కనుక యీనాటి మేధావులు అనే తత్వము కేవలము ఒక విధమైన

109038605

బలహీనత. మేధాశక్తిని అభివృద్ధి చేసుకోటం విద్య అని మనము భావిస్తున్నాము. ఇక్కడ Education in Human Values అని వుంది. నా ఉద్దేశములో Human Value నే education. ఈ సత్య ధర్మ శాంతి ప్రేమ అహింసలను ఎవరు చక్కగా నిర్వచించి, చక్కగా నేర్చుకొని దానిని ఆచరించటానికి, అనుష్ఠించటానికి, అందించటానికి, ఆనందించటానికి ప్రయత్నము చేయునో వాడే నిజమైన విద్వాంసుడు. అయితే నిత్యజీవితం కూడను మరొకవైపున వుంటుంది. తనయొక్క బాధ్యతలు కూడా కొన్ని వుంటున్నవి. తన కర్తవ్యాలు కూడను నిర్వర్తించవలసిన విధి కూడను మరొక వైపున వుంది. దానినిమిత్తమై కొన్ని వృత్తులు సల్పి తన ఉదర పోషణ నిమిత్తమై కొన్ని విద్యలు కూడ అనుభవించవలసినదే. కనుక యీ విత్ అనే ధాతువు నుండి వచ్చినది విద్య. విత్ అనేది ప్రకాశమును అందించేది. చీకటిని దూరము చేసి సత్యమును నిరూపించే వెలుతురు వంటిది. అనగా అజ్ఞాన, అంధకార, అహంకారము అను రూపుమాపి, ప్రజ్ఞాన, ప్రశాంతిని, ప్రకాంతిని కూడను చేకూర్చేది విద్య. ఈ లోకమునకు యీ యొక్క భౌతిక విద్యకూడా అవసరము. ఈ భౌతికమైన నిత్యానుభవమునకు సత్యానుభవమైన మానవుని విలువలు దీనికి తోడు చేసుకోవాలి. ఇట్టి విద్యలు నేర్చుకొనుటకు అందరూ అధికారులే. ఈ విద్యను ప్రతి యింటియందు, ప్రతీ ఆఫీసునందు, ప్రతి ఫ్యాక్టరీయందు, ప్రతి వర్క్‌షాపునందు అందరు కూడను అవలంబించాలని ప్రిన్సిపల్ నరేంద్ర చెప్పాడు. Every house, every factory, every office అన్నాడు. ఇది కాదు ప్రధానము. Everyone ప్రతి ఒక్కడు కూడను దీనిని అనుభవించవలసినదే.

ప్రతి ఒక్కని దేహము ఒక వర్క్‌షాప్. ఈ దేహమే ఒక యంత్రము. ఈ యంత్రము అన్ని అంగములయొక్క సంబంధ బాంధవ్యాన్ని గుర్తించుకొని వర్తించటము చేతనే యిది ఒక పెద్ద యంత్రముగా రూపొందించుకోవాలి. ఈ యంత్రము లోపల ఒక్కొక్క అంగమునకు ఒక్కొక్క సన్నిహిత సంబంధము వుంటుండాది. సంబంధము వుండినంత మాత్రమే కాదు. దీనియొక్క బాధలను, ఆనందములను ఒకదానికొకటి పంచుకుంటూ వున్నవి. ఈ workshop అయిన దేహము లోపల అనేక విధములైన అనురాగములుంటున్నాయి. దీనినే ఒక unity అని చెప్పుకుంటూ వచ్చాము. ఈ unity అనగా కలసి మెలసి వుండే తత్వాన్ని మన దేహమే మనకు చక్కగా బోధిస్తుండాది. ఈ workshopను మనము చక్కగా అంతదృష్టితో పరిశీలించనప్పుడు మరొక workshop మనకు అక్కరలేదు. ఇక్కడ మనసు ఫలాని వస్తువు నాకు కావాలని సంకల్పించుకుంటుందనుకోండి. తక్షణమే దానిని పొందటానికి ప్రయత్నం చేస్తాయి కాళ్ళు. ఫలాని చెట్టున వున్న పండు నాకు కావాలని మనసు ఆశించిన తక్షణమే ఆ ఫలము మనకు లభించటానికి వీలుకాదు. ఆ చెట్టు దగ్గరకు కాళ్ళు పోతాయి. మనసుయొక్క అభీష్టాన్ని

109038606

నెరవేర్చటము పాదములయొక్క కర్తవ్యము. తమ కర్తవ్యమును మాత్రమే తాము చేశాయి. అక్కడకు పోయి నిల్చునుంది. అప్పుడు తక్షణమే నడుము తనయొక్క కర్తవ్యాన్ని తాను చేస్తుంది. వంగుతుంది క్రిందకు. తన పని తాను చేసింది యీనడుము. కాని ఫలము తనకు దక్కలేదు. తరువాత చేయి ఒక రాయిని తీసుకుంది. రాయి చేతికి చిక్కినంత మాత్రమున ఫలము లభించలేదు. తనపని తాను చేసింది. వూరుకుంది. తరువాత భుజము తనపని తాను ప్రారంభించింది. ఆరాయిని విసిరింది ఆ చెట్టుకు. ఆఫలము క్రిందపడేటప్పటికి వేళ్లు అందుకున్నాయి. తమ పని తాము చేశాయి. ఆఫలమును నోటికందించాయి. నోరు కూడను తన పని తాను చేసింది. రుచిని చూసింది. పులుపా తీపా అని. తీయగా వున్నదా యిది నాకక్కరలేదు. అన్నింటికిని యిచ్చమాని జఠరాగ్నినీవు తీసుకో అని లోపలికి పంపించింది. లేక అది పులుపుగా యేమైనా వున్న యిది నాకు సరైనది కాదు. ఇది కేవలము ఒక రోగానికి మూలకారణమవుతుంది. అని భూదేవికి అందిస్తుంది. తూ అని వూసేస్తుంది. ఈ విధముగా లోపలికి పంపించిన ఫలమును యీ అన్ని అంగములు చేరి నాకు అందించినాయని తాను గర్వముగా భావించదు. ఇందులో వున్న జఠరాగ్ని దానిని చక్కగా దహనము చేసి దానిలో వున్న సారాన్ని అన్ని అంగములు చేరి నాకు పంపించినాయి కదా అని దాన్ని అన్ని అంగములకు సప్లై చేస్తూ వస్తుంది. ఈ విధమైన అన్యోన్య సంబంధ బాంధవ్యమనేది మన దేహములోనే చక్కగా నిరూపించటానికి అవకాశముంది. ఈ అన్యోన్యతను మనము నిత్యజీవితము లోపల కొంతవరకు అనుభవించాలి.

ఒక దారిలో మనము నడుస్తున్నాము. కన్నులు పైనున్నవి. కాళ్లు క్రింద నున్నవి. ఆ దారిలో కన్నులు ఒకముల్లును చూచింది. కాని వీటి సంబంధము బాహ్యముగా యెవరికి అర్థము కావటంలేదు. ఇది అంతర సంబంధముగా వుంటుందాడి. ఎప్పుడు చెప్పిందో ఏ ఫోను వుందో, ఏ టెలిగ్రాఫ్ వుందో తక్షణమే కాలు దాన్ని దాటుకు వెళ్లిపోతుంది. కాళ్లకు కన్నులు లేవే యిది ఎట్లా దాటుకుంది. చూచినది కన్ను. దాటినది కాళ్లు. ఈ కన్నులకు కాళ్లకు అంత సన్నిహిత సంబంధము వుంటుందాడి. ఒక వేళ యీ పాదములు కంటి మాటనే వినక అది కాలును ముల్లుపైన పెట్టినా తాను చాలా రక్తమును ధారపోసుకుంటుంది. తగిలినది కాలుకుగాని ఏడ్చేది కన్ను. కాలికి ముల్లు తగులితే కన్ను ఎంత బాధపడుతుందో యోచన చేసుకోండి. ఈ ముల్లు గుచ్చుకున్నది నాకు కాదు కదా అని తాను వూరకే వుండవచ్చు కదా! కనుక యీ రెండు ఎంత ప్రేమానురాగములు కల్గి వుంటున్నాయో మనము యోచించుకోవాలి. ఇదే మానవత్వము. పరులకు కలిగిన బాధను నా బాధ మనము భావించుకున్నప్పుడే నిజమైన మానవత్వముగా రూపొందుతుంది. కనుక యిట్టి మానవతా విలువలను

109038607

మన యింద్రియములే మనను బాధ చేయుచున్నవి. అవే నిజమైన గురువులుగా రూపొందుతూ వస్తున్నాయి. కనుక మన దేహమనే యంత్రములో మనము నేర్చుకొనవలసినవి ఎన్నియో వుంటున్నవి. ఈ దేహమనేది కేవలము క్రియాకలాపములలో ప్రవేశించేవి. ఇది కర్మలకు ప్రధానమైన పాత్ర. ఏవిధమైన కర్మలు మనము ఆచరించవలెనన్నను యిది దేహమునకు సరైన శక్తి సామర్థ్యములు అత్యవసరము. కనక దేహమును మనము మొట్టమొదలు ఆరోగ్యవంతముగా చూచుకోవాలి. పైనవున్నదికదా యని తలకు ప్రత్యేకత కాదు. కాళ్ళక్రింద వున్నవి కదా యని మనము నీచముగా భావించకూడదు. ఈ రెండింటికి వున్న సన్నిహిత సంబంధము మనయొక్క ప్రేమతత్త్వము. ఈ ప్రేమ తత్త్వము నఖశిఖపర్యంతము మనము ప్రసరింపచేసుకున్నప్పుడే మన జీవితము పూర్ణవంత మవుతుంది. కనుక తల చేసిన ఆలోచనలన్నీ కూడను కార్యరూపకముగా మనము అనుభవింప చెయ్యాలి. ఇలాంటి అంగములయందు వుండిన సంబంధ బాంధవ్యమనేది మనకు నిత్యానుభూతులు. ఇట్టి నిత్యానుభవములు కూడను లోకమునకు అత్యవసరము.

ఈ మానవతా విలువలు యేందో ఐదు సంవత్సరములు ఆరుసంవత్సరముల పూర్వము మనము ప్రారంభించినామని మీరు భావించవచ్చు. ఇది ఎనభై సంవత్సరముల పూర్వము నేను ప్రారంభించాను. కరణము సుబ్బమ్మ యింటిలో వుండినప్పుడు నేను భజనలోపల ఒక పాట పాడేవాడిని.

సత్య ధర్మము శాంతి ప్రేమలతో
నీ నిత్య జీవన యాత్ర సాగించు జీవా
ప్రకృతి ధర్మము పట్టు విడకండి
కర్మ యోగమె జన్మ ధర్మంబు
స్మరణే మానవ జన్మ రహస్యము.
సాధనే భక్తుల సారలక్షణాము ॥సత్య॥

ఇందులో మన హృదయమనేది విశాలమైన భూమిగా నిరూపించింది. మన మనస్సునే మడకగా తీసుకుంది. గుణములను ఎద్దులుగా భావించుకుంది. వివేకము చలకోలనుగా తీసుకుంది. ఈ హృదయ క్షేత్రాన్ని సాగుచేయమని బోధించింది. ఏమిటి మనము దీంట్లో పండించే పంట. సత్య, ధర్మ, శాంతి ప్రేమలను యిదే మనము పండించే పంట.

భక్తే వర్షము భావమే కలుపులు
బ్రహ్మానందమె పండేడు పంట. ॥సత్య॥

కనుక మనము యీనాడు ఏమి చేయాలి. 'మనసే మడకగ గుణమె ఎద్దులు ఈ మనస్సనే

109038608

మడక అదుపులో పెట్టుకొని, గుణములనే ఎద్దులను కట్టుకొని, వివేకమనే చలకోలను తీసుకొని యీ హృదయములోపల ప్రేమ పంటను పండించాలి. సత్యపంటను పండించాలి. ధర్మపంటను పండించాలి. శాంతి పంటను పండించాలి. అది మన హృదయములో పండించుకోవలసిన పంట. ఈ పంటను పదిమందికి మనము అందించాలి.

మన జీవితమనేది ఐస్‌గడ్డ వంటిది. ఇది క్షణక్షణము కరగిపోతూ వుంటున్నది. కరగిపోక మునుపే నలుగురికి పంచిపెట్టాలి మనము. ఆవిధమైన పంచిపెట్టే పరిస్థితే యీనాడు మనము education in human values అని ప్రారంభించాము. దీనిపైన అనేకమందికి అనేకమైన అపోహలు వుండవచ్చు. ఈ వాదోపవాదములకు యేమాత్రము స్థానము నందించ నక్కరలేదు. ఇది ప్రతి మానవుడు కూడను సాధించవలసిన సత్యస్వరూపము. దీనిలో ఒకరికొకరు తోడుగా వుంటుండి అన్యోన్యతగా ఐకమత్యముగా దీనిని సరైనరీతిలో జగత్తుకు అందించాలి. ఇందులో నిత్యానుభవము వుండినప్పటికిని సత్యానుభవము లక్ష్యములో వుంచుకోవాలి. ఏకమ్ సత్ విప్రా బహుదా వదంతి. అన్నింటికిని ఆధారమైనది ఒకటి వున్నది అనే సత్యాన్ని మీరు గుర్తించాలి. సత్యసాయి సేవాసమితి, సత్యసాయి భజన మండలి, సత్యసాయి సేవాదళము, సత్యసాయి స్టడీ సర్కిల్, సత్యసాయి మహిళావిభాగము, సత్యసాయి ఎడ్యుకేషన్ ఫౌండేషన్ యివన్నీ కూడను కొన్ని కొన్ని అంగములుగా వుండినప్పటికిని అన్నింటికిని ప్రధానమైన ఆధారము సత్యసాయి. ఈ లక్ష్యాన్ని మనము పెట్టుకొని మనము యేమి చేసినప్పటికిని అది సత్యాన్నే పొందుతుంది. మనము మన సోదర మానవులనందరిని కూడను పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టాలి. కొంగ తన సూటైన ముక్కుతో కొన్ని చేపలను తిని తన కడుపుకే తాను భుజిస్తుంది. తన కడుపే కైలాసంగా భావిస్తుంది. మనము కొంగలవలె తయారు కాకూడదు. తనతో పాటు యింకా అనేక మంది జీవులుంటున్నారనే విశాల భావాన్ని మనము అభివృద్ధి పరచుకోవాలి. మనము అనుభవించిన యీ పవిత్రమైన ప్రసాదమును అందరికి కూడను పంచటానికి ప్రయత్నించాలి.

ఈనాడు education in human values అనే మానవతా విలువలనే విద్యను అందరూ ఆకర్షిస్తున్నారు. కారణము యీ విలువ లేకపోవటం చేతనే. జగత్తంతా కూడను భయభ్రాంతులతో కూడి వుంటుండాది. మన Principal నరేంద్ర చెప్పాడు ఈనాడు జగత్తులో చాలా ప్రమాదకరమైన యంత్రములంతా బయలుదేరుతున్నాయి. బాంబులు బయలుదేరుతున్నాయి. Star war అంతా బయలుదేరుతున్నాయి. ఇలాంటి భయంకరమైన సమయములో యిది చాలా అవసరమని చెప్పాడు. ఈ బాంబులు

109038609

యీ బయట మనలంత బాధించటంలేదు. మనలో వున్న దుర్గుణములే మనలను బాధిస్తున్నాయి. కారణమేమనగా ఆ బాంబులు ఒక్కతూరి వేస్తే నిశ్చింతగా మనము భస్మమై పోవచ్చు. ఏ బాధ వుండదు. కాని యీ దుర్గుణములనేవి బ్రతికించి చిత్రహింస చేస్తుంటాది. ఈ బాధ ఆ బాధకంటె అధికమైన బాధ. కనుక మనయందు వుండిన ఈర్ష్య, అసూయ, డంబము, ఆడంబరమనే యీ దుర్గుణములను మనము శుభ్రము చెయ్యాలంటె యీ సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింసలు అనే బ్రష్‌లు మనము సంపాయించుకోవాలి. లౌకిక సంబంధమైన విద్యలతో బాటు పారమార్థికమైన, ప్రధానమైన యీ మానవతా గుణములను మనము అధికముగా పోషించుకుంటూ రావాలి. తైలము దీపానికి ప్రాణమిస్తుంది. కాని మన ప్రేమ జీవితానికే ప్రాణమిస్తుంది. కనుక మన జీవితానికి ప్రేమ అనేదాన్ని తైలముగా మనము తీసుకోవాలి.

ప్రమిద నూనె వత్తిగలదు
దీపపు వెలుగు కలుగునా

కాన దీనిని అంటించే వాడు ఒకడు వుండాలికదా. పుష్పాలు, దారము వుంది, పుష్పమాల తాన గునా. దీనిని కుట్టేవాడు ఒకడు వుండాలికదా. స్వర్ణము, రత్నాలు కలవు, సొమ్ములు నిర్మాణమగునా. చేసే వాడు ఒకడు వుండాలికదా. అదే విధముగనే సత్యసాయి అందించిన యీ పంచరత్నములయందు కూడను పంచరత్నములు పంచరత్నములుగానే వుండాది. కాని అందించేవారు కొంత మంది వుండాలి కదా. అది అందించే నిమిత్తమై ప్రభుత్వముతో కూడను కొంత సంబంధము ఏర్పరచుకోవలసి వస్తుంది. ప్రభుత్వముతో మనము సంబంధ బాంధవ్యము కల్పించుకొనకుండిన ఆ మునిసిపాలిటీలు, కోర్పరేషనులు ఆ టీచర్సును యిక్కడను పంపరు. వారిని పంపనిదే వారికి మనము బోధించటానికి యేమాత్రము అవకాశము వుండదు. కాని ఎవరితో మనము సంబంధ బాంధవ్యము కల్పించుకున్నప్పటికిని సంబంధమైన సత్యసాయికి ఏమాత్రము దూరము కాకూడదు. అందునిమిత్తమై దీనిని ఒక రిజిష్టరు బాడీగా చేయవలసి వచ్చింది. ఎవరంటె వారు పోయి కోర్పరేషన్ ఆఫీసు దగ్గరకు పోయి మాట్లాడలంటె get out అంటారు. కాని మనము అధికారమును కల్గినవారమైతే అవతలివారు చక్కగా welcome చూసి దానికి తగిన చర్యతీసుకుంటారు. కనుక మనము ప్రభుత్వముతో కొంతవరకు సంబంధము పెట్టుకున్నంత మాత్రమున మనము దీనిని వేరే విధముగా భావించరాదు. మొట్టమొదట నేను చెప్పినట్లుగా మన నిత్యానుభవము ఒకటి, సత్యానుభవము ఒకటి. ఈ రెండింటిని సన్నిహిత సంబంధము చెయ్యాలి. కనుక యీ రెండింటి యేకత్వము చేత యీ మానవత్వాన్ని మనము అభివృద్ధి

గావించుకోటానికి తగిన కృషి చెయ్యాలి.

నిత్యానుభవము ప్రతివ్యక్తికి అవసరము. ఐయిన్‌స్టీన్ గొప్ప విజ్ఞానవంతుడు. అతడు అనేక రకములైన పరిశోధనలు ఆకాలము నందే చేసి సత్యస్వరూపాన్ని గుర్తించుకున్నాడు ఈ జగత్తంతయు పరమాణు తరంగముల యొక్క స్వరూపమే అనుకున్నాడు. పరమాణువే తరంగము, తరంగమే పరమాణువు యొక్క పరికరములని భావించాడు. ఈ దేహము, యీ జగత్తు యీ సర్వ పదార్థములు కూడను పరమాణువుల యొక్క సముదాయమే అని గుర్తించుకున్నాడు experiments లో. ఎంత సత్యాన్ని గుర్తించుకున్న విజ్ఞానవేత్త అయినప్పటికి నిత్యజీవితములో morning, evening, north, south అనే యీ స్వానుభవమును మాత్రమే తాను వుపయోగపెట్టుకుంటూ వచ్చాడు. దేహము నీటి బుడగ వంటిది అనుకున్నాడు. అయితే యీ నీటి బుడగ శిథిలము కాక పూర్వమే అనేక రకములైన సత్యాన్ని గుర్తించాలని భావించాడు. ప్రతి అణువును సద్వినియోగపరచాలని సంకల్పించుకున్నాడు. అతని కాలము లోపల యీ నాటి ఆధునిక యుగములో వలె పెద్దపెద్ద Labs లో experiments కు తాను లక్షలు కోట్లు ఖర్చుపెట్టి యేమాత్రము తాను క్రోఢీకరించలేదు. simple life అనే మార్గములో ఆదర్శము నిరూపించాడు. ఈనాటి మన చదువులు, మన విద్యలు, మన ప్రవర్తనలు యేరీతిగా వుంటున్నాయంటే మనము జీవితమనేది అర్థము చేసుకొనకుండా అడుగు భాగములో వుంటుండి ఆడంబరమనే అధికారములో మనము ప్రవేశిస్తూ వస్తున్నాము. Higher Life, Low thoughts యీవిధంగా వుంటున్నాము. నేను కూర్చోటానికి మంచి కుషన్ ఛైర్ వుండాలేదా అని కుషన్ ఛైర్ కోసం చూస్తాడు. air condition కావాలి తన యొక్క office room కు. ఆనాడు ఐన్‌స్టీన్ ఒక పేపరు ఒక పెన్సిలు waste paper basket యిదే అతని Lab. ఈనాటి professors అందరు యీ విధమైన దురభ్యాసములు అభివృద్ధిగావించుకుంటూ వస్తున్నారు. ఇది సరైన చర్య కానేరదు. మన విద్యాసంస్థలయందు ధనమును మితముగా ఖర్చుపెట్టాలి. ధనము లేక ప్రపంచము ఎన్నో కష్టములకు నష్టములకు గురౌతున్నది. కేవలము సోంబేరు professors మాత్రమే యీ experiments కోరుతుంటారు. ఎందుకంటె equipment వుంటే switch వేసి సులభముగా నేర్చుకోవచ్చు. నేను ఎక్కువ శ్రమ పడనక్కరలేదు, నేను ఎక్కువ చెప్పనక్కరలేదు అని యీ విధమైన స్వార్థము కోసము ప్రయత్నం చేస్తున్నాడు. తద్వారా జరిగే బాధలు చాలా అధికముగా వుంటున్నాయి. అదివారు గుర్తించటంలేదు. ఈనాడు యీ ఆధునిక యుగము లోపల కంప్యూటర్సు ఎక్కువగా పెరిగిపోతున్నాయి. ఈ computers వల్ల professors కు అధికమైన కష్టములుంటుండవు. ఈ computers లో పువ్వులు వేశాము పువ్వుల పొడరు వస్తుంది. చెడ్డది వేస్తే చెడ్డది వస్తుంది. మంచిని వేస్తే మంచిదే వస్తుంది. మనము వేసే దాంట్లో వుంటుండాది. ఇంకా నిత్యజీవితములో

ఆడవారికి, మగవారికి, పిల్లలకు అందరికి calculators కూడా వచ్చాయి. చీర 30 రూపాయల కు కొన్నాము. భర్తకు paint 20 రూపాయలకు కొనుకున్నాము. తన బిడ్డకు ఒక గౌను కొనుక్కున్నాది. అదొక 10 రూపాయలు అయింది. తన కొడుక్కి ఒక నిక్కరు కొనుక్కుంది. ఈ చీర యీ పేంటు యీ షర్టు యీ నిక్కరు యివి చేయటానికి యిది వత్తుకుంటారు అక్కడ. ఈ విధమైన యంత్రములపై ఆధారపడితే సహజమైన తెలివితేటలు యెంత పాడైపోతున్నాయో యోచన చేసుకోండి. పాతకాలములో మన పిల్లలకు లెక్కలు చెప్పించాలంటే చాలా శ్రమపడి వారు కంఠస్తము చేసుకొని తలలోకి ప్రింటు అయిపోయివి యివన్నీ. మన సహజమైన తెలివితేటలతో యీ విద్యను మనము అభ్యసించాలి. ఈ యంత్రాలపై మనము అధికముగా ఆధారపడరాదు. అందులో కరెంటు వుంటే సక్రమముగా జరుగుతుంది. లేకుండా పోతే వక్రమైపోతుంది.

కనుక మొట్టమొదటి కంప్యూటర్ తల. దీనిని సక్రమమైన మార్గములో పెట్టుకునేటట్లు చేయడు యీనాడు పిల్లలకు మనము చెయ్యాలి. మనము యంత్రములను అధికమైన వెలకు తీసుకొని వచ్చి ప్రయోజనము లేదు. దానిని వినియోగించుకునే విధానము గుర్తించుకోవాలి. కనుక సక్రమముగా వినియోగించుకున్నప్పుడే యీ ధనము ఆ యంత్రము సరైన రీతిలో ఫలితాన్ని యిస్తుంది. ముఖ్యముగా యీ మానవతా విలువల లోపల యీ waste of money అనేది కొంత గుర్తు పెట్టుకోవాలి. waste of food ను కూడను దీనికి add చెయ్యాలి. waste of time కూడను దీనికి జత చెయ్యాలి. ఈ విధమైన తరిబీదును మనము యీనాటి అధ్యాపకులకు కూడను అధికముగా చెప్పాలి. ఈనాటి అధ్యాపకుల విషయము ఎట్లా వుందంటే మీరు వేరుగా భావించకూడదు. నేను యెంతో ప్రేమతో, దయతోను సక్రమమైన మార్గమును అవలంబించాలనే పుద్దేశ్యముతో చెప్పవలసి వచ్చింది. కొంత మంది అధ్యాపకులు ఏదైనా పని చెయ్యాలంటే దీనిని మొట్టమొదట master plan చెయ్యాలి. ఒక Lab కు ఒక హాలు కట్టావనుకోండి. ఈ హాలు లోపల ఏ రూమ్ ఎక్కడెక్కడ ఏ ఏ పరిస్థితిలో మనము యిముడ్చాలి అనే plan మొట్టమొదట వేసుకోవాలి. ఒక గోడ కట్టేది. రెండు సంవత్సరములైన తరువాత అది అక్కర లేదు కొట్టేది. మరి కట్టేది కొట్టేది కట్టటం, కొట్టటం యిదా వీరు చేసే పనులు. మొదటే యీ రకంగా వుండాలని తెలియని ప్రొఫెసర్ ప్రొఫెసరవుతాడా. అనుభవాలు కావాలి.

ఇంతే కాదు. మరికొన్ని విషయములు. ఇప్పుడు Physics Chemistry Biology యిలాంటి subjects అంతా వున్నాయనుకోండి. దీనికి సంవత్సరానికి తగిన chemicals మనం తెప్పించుకోవాలి. మన experiments కి ఒక వ్యూహ క్రింద

యింత అవుతుందని సరైన యోచన చేసి, దానిని సరైన రీతిగా equipment list యివ్వాలి. కాని అట్లా చేయటంలేదు. ఊహాగానము. ఈ ఊహాగానాలంతా bath roomలో పాడుతుంటారు. Lab లో పాడకూడదు. దీనికంతా 60 వేల రూపాయలు అవుతుందని వేస్తారనుకోండి. ఏమిటయ్యా యీ 60 వేల రూపాయలు దేనికోసం అనడిగితే. పోతే పోనీ 20 వేల రూపాయలు తగ్గించండి. యిదేమి కూరగాయల వ్యాపారమా. అయ్యా వంకాయలు నాలుగు రూపాయలు 1 kg అంటే మూడున్నర రూపాయలకివ్వండని బేరమాడుతుంటారు. ఆవిధముగా తయారైపోయింది యీ equipments ఏవిధమైన అలక్ష్యము చేతగాని, యేవిధమైన అశ్రద్ధతోగాని, ఒకవిధమైన ఆలోచనారహితము గాకాని మనము ధనమును వృథా చేయరాదు. దీనికి వుంకొకటి. మీరు క్షమాపణకి అనుకోండి. నాలో కూడను ఒక బలహీనత వుంటుండాది. కాని నాదృష్టిలో అది బలహీనత కాదు. ఈ ప్రజల దృష్టిలో యిది బలహీనతగా వుంటుండాది. నేను సక్రమమైన ధన వినియోగము లోపల లక్షలైనా యిస్తాను దానికి వెనుకాడను. ఏమైనా దుర్వినియోగము చేసేటట్టుగా వుంటే ఒక్క దమ్మిడీ యైనా నేను పట్టేస్తాను. డబ్బును యిచ్చే విషయములో చాలా control గా వుంటాను. కారణము యేమంటే యీ ధనము వల్లనే జగత్తులో అన్ని దుర్గుణాలు పెరుగుతుండేది. నేను ఆవిధముగా కఠినముగా చూచినప్పుడు వారికి బాధ కలుగుతుంది. కాని వారికి బాధైనా ఫరవాలేదు. నేను మాత్రం నా పట్టును వదలను. నీవు సరైన రీతిలో యెంతైనా అడుగు నేను తప్పక యిస్తాను. ఇది యెందుకోసమంటే ఒక ఆదర్శమైనదానిని జగత్తుకు అందించాలి. జగత్తులో యిలాంటి దుర్వినియోగములు యెన్నో జరుగుతూ వుంటాయి. కాని మన సంస్థలు యిటువంటి దుర్వినియోగములు జరుగకూడదు. అందునిమిత్తమై యింత కఠినమైన training యిస్తూ వస్తుంటాను. ఈ విధముగా స్వామి చిన్న నడక యందు, మాట యందు, తలపునందు ఆదర్శమును నిరూపించాలి. అదినాయొక్క ప్రధానమైన పట్టుదల. నాకు కష్టమనేది యెప్పుడులేదు. అయితే ఎవరైనా అబద్ధము చెబితే భరించలేని బాధకలుగుతుంది. సత్యాన్ని చెప్పు. ఎందుకు యీ చిన్న విషయాలలో అసత్యాన్ని అభివృద్ధి పరచుకుంటావు. అయింది అయిందికానిది కాలేదు అనే సత్యమును చెప్పుకుంటే ఎంత ఆనందము వస్తుంది. ఈ అసత్యాన్ని మరుగుచేసే నిమిత్తమై యింక పది అసత్యములు చెప్పవలసివస్తుంది.

నా వుద్దేశములో యీ మానవతా విలువలలో సత్యము చాలా ప్రధానమైనది. సత్యంనాస్తి పరోధర్మః. మనం అసత్యాన్ని ప్రవేశపెడితే మనం ప్రవేశపెట్టిన మార్గమునందు అసత్యరూపము ధరిస్తుంది. కనుక మానవుని ప్రధానమైన ప్రాణము వంటిది సత్యము. సత్యము పోతే ప్రాణము పోయినట్టే. కనుక యీ సత్యాన్ని లక్ష్యమునందు పెట్టుకొని ధర్మమును, శాంతిని, అహింసను నిత్యజీవితములో అభివృద్ధి పరచుకోవాలి.

కనక ఈనాడు అధ్యాపకులందరు కూడను తక్కువ వ్యయముతో ఎక్కువ శిక్షణ నిచ్చే పవిత్ర హృదయులుగా పిల్లలను మార్చాలి. ఇంతే కాకుండా కాలనిర్ణయాల్లో మనము ప్రవేశించరాదు. తెల్లవారి 9గంటలకు పోవటం నాలుగున్నర గంటలకు రావటం యిదినా పద్ధతి అనే పట్టుదలలో మనం వుండరాదు. అవసరం వస్తే రాత్రి వరకు వుండి ఆ పిల్లల సందేహాలు, సమస్యలు పూర్తి తీర్చి నీవు యింటికి రావాలి యిది నీ కర్తవ్యము. ఏదైనా Lab లో ఒక సమస్య యిచ్చి వుంటారు. ఆ సమస్య అనుకున్న కాలములో పూర్తి కాలేదు. ఆ సమస్య పూర్తి అయ్యేంతవరకు ఆ పిల్లవాడిని అక్కడే పెట్టుకోవాలి నీవు అక్కడే వుండాలి. సమస్య పూర్తి తీర్చి నీవు యింటికి రావాలి. ఈ పట్టుదల అధ్యాపకులలో వుంటుండాలి. అదే సరైన టీచింగు. పిల్లల హృదయాలను పూర్తిపరిపూర్ణం గావించుకునే పద్ధతిని మనము నేర్పించాలి.

కనుక కేవలము మానవతా విలువలు సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ అహింసలు చెప్పే ప్రయోజనము లేదు. దీనికి వుపాంగములుగా వున్న చుట్టూ వాతావరణము మార్చటానికి ప్రయత్నించాలి. ఒక చిన్న ఉదాహరణము. తట్టలో పంచ భక్ష్య పరమాన్నములతో పెట్టుకున్నాము. కావలసినంత వంటకాలంతా వున్నాయి. కాని చుట్టూ వుండిన వాతావరణము దుర్గంధము వుండిన ఆ పదార్థములు మన పొట్టను చేరలేవు. కనుక ఆ పదార్థములతోబాటు చుట్టూ వున్న వాతావరణము పరిశుద్ధమైనదిగా రూపొందింప చేయాలి. నిజముగా అలాంటి పవిత్రమైన భావము వుండినప్పుడే మనము అన్ని విధములుగా కూడను సాధించటానికి, ఎదుర్కోటానికి తగిన ధైర్యసాహసాలు రావాలి. ఈనాడు లోకములో అధ్యాపకులు సరైన శిక్షణలో వుండినప్పుడు దేశమంతా పవిత్రమైన రూపాన్ని ధరిస్తుంది. పిల్లల యొక్క పెడమార్గమునకు తల్లితండ్రులు, గురువులే. ఇంటిలో తల్లితండ్రులు పిల్లలను పెడమార్గము పట్టిస్తున్నారు. పిల్లపైన ప్రేమ వుండవచ్చు. కాని ప్రేమ పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టేదిగా వుండాలి. అట్లు కాకుండా పిల్లలపైన ప్రేమను అసభ్యముగా ప్రవర్తింప చేసేదిగా దొంగ్ల స్వాతంత్ర్యమును అందించినప్పుడు ఆ పిల్లల యొక్క బాధను తిరిగి ముసలిందు నీవే అనుభవించవలసి వస్తుంది. పూర్వకాలమందు తల్లి, తండ్రి అంటే పిల్లలు ప్రాణసమానంగా చూచుకునేవారు. తల్లితండ్రులను ఒక్క క్షణమైనా వదలి వుండేవారు కాదు. అప్పుడే మాతృప్రేమను వారు అనుభవించి దివ్యమైన తేజస్సుతో వృద్ధి పొందేవారు. ఈనాడు తల్లితండ్రులను వదలి దూరప్రదేశాలకు పోవాలంటే సంసిద్ధులుగా వుంటున్నారు పిల్లలు. దీనికి కారణము యేమిటి? ఈ తల్లితండ్రుల యొక్క సంబంధ బాంధవ్యము సరైన రీతిలో లేదు. కనుక వారిని సరైన ప్రేమతో, సక్రమమైన మార్గములో ప్రవేశింప చేయటానికి శిక్ష వుండాలి. ప్రేమ వుండాలి. కనుక పిల్లల పరిస్థితిని చక్కదిద్ది సరైన మార్గములో ప్రవేశపెట్టటానికి అధ్యాపకులు, తల్లితండ్రులు కూడను అత్యవసరం

109038614

కనుక యీ అధ్యాపకులు అప్పుడప్పుడు ఆ పిల్లల తల్లి తండ్రులను చేర్చి వారికి కూడను యీ మానవతా విలువలు బోధించటానికి ప్రయత్నించాలి. మన education in human values trust వారు కేవలం అధ్యాపకులకే కాకుండా తల్లి తండ్రులకు కూడను కొంతవరకు కొన్ని ప్రదేశములలో వారు ప్రత్యేకమైన సమావేశములు జరిపించి వారికి బోధించటానికి కృషి చెయ్యాలి.

కొన్ని కొన్ని చిన్న చిన్న సమస్యలు కూడా వుంటుంటాయి పాపం అధ్యాపకులకు. Teachers ను పిల్లలను చక్కగా బోధించమని మనము చెప్పవచ్చు యింకా అందరూ చెప్పవచ్చు. గవర్నమెంటు కూడా వత్తిడి తేవచ్చు. కాని కొన్ని కొన్ని ప్రాంతములలో teachers కి ఆరు నెలలు, సంవత్సరమునకు ఎనిమిది నెలలు జీతాలు యివ్వటంలేదు. వారు యేరీతిగా బోధించగలరు. ఇంటిలో యనేక సమస్యలతో వుంటారు పాపం. ఇల్లు గెల్చి రచ్చ గెలవాలి. ఇంటినే గెలవలేని వాడు పాఠశాలలో పిల్లలను యేరీతిగా బోధించగలరు. కనుక యిలాంటి సమస్యలు టీచర్లను లేకుండా పోలేదు. కాబట్టి వారి యొక్క సమస్యలను గుర్తించటానికి ప్రయత్నించాలి. ఈ విధముగా టీచర్ల యొక్క కర్తవ్యాన్ని, తల్లితండ్రుల యొక్క కర్తవ్యాన్ని, ట్రస్టు వారి కర్తవ్యమును సక్రమముగా గుర్తించుకొని అన్యోన్యముగా కలిసి మెలిసి వుండినప్పుడే దీన్ని యెంతైనా మనము సాధించటానికి సాధ్యమౌతుంది. కనుక మన సంస్థలలో వుండిన వారందరు కూడను యీ మానవతా విలువలను తగినంత శ్రద్ధతో అభివృద్ధి పరచుకొని, తమ యొక్క వ్యక్తిగతమైన రీతిగానే కాకుండా, సమాజమునందు కూడను యీ మానవతా విలువలను సాధ్యమైనంత వరకు ప్రచార ప్రబోధలు చేయటానికి తగిన కృషి చేయాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.